# కదిలే నీడలు



పి.ఎస్. నారాయణ

పడమటి వైపు ఆకాశం నెత్తుటి మడుగులో తడిసినట్లున్నప్పుడు రామ్మూర్తి ఆ చిన్న స్టేషన్‌లో చేతిలో హ్యాండ్ బ్యాగ్‌తో రైలు దిగాడు. దిగి రైలు వెళ్ళింతరువాత చుట్టూచూస్తే అక్కడ దిగింది తను ఒక్కడేనేమో ననిపించింది. ఎక్కడా జనసంచారమే లేదు.

స్టేషన్ మొత్తానికి ఒకటే కిరసనాయిల్ దీపం. తన పనయితే ఎవడి చావు వాడే చస్తాడు అన్నట్లుగా అప్పుడే ఆ దీపాన్ని వెలిగించాడు స్టేషన్ మాష్టరు అనబడే ఆ పెద్దమనిషి. ఆయనకు అప్పటికే యాభై ఏళ్ళు దాటి వుంటాయి.,తలంతా నెరిసిపోయివున్నది. భూతద్దాల కళ్ళజోడు వున్నది. తెల్ల ప్యాంటు...జానెడు వెడల్పు బెల్టు... పెద్ద పెద్ద మీసాలు...

"మాష్టారూ! నమస్కారం...నేను హైద్రాబాద్ నుంచి వస్తున్నాను ... రామారం వెళ్ళాలి...దారి ఎటో కాస్త చెబితే...నలుపక్కలా కమ్ముకొస్తున్న చీకటి నన్ను చుట్టివేయకముందే నేను వెళ్ళగలుగుతాను!" అన్నాడు రామ్మూర్తి రెండు చేతులూ జోడించి.

స్టేషన్‌మాష్టరు కళ్ళజోడు తీసి పెట్టుకొని, బెల్ట్, ప్యాంటు సర్దుకుని, "నమస్కారం, నమస్కారం...చిన్న రామారమా...? పెద్ద రామారమా!" అన్నాడు.

రామ్మూర్తి ఓ గొప్పనేరం చేసినవాడిలా తడబడ్డాడు. బుర్ర గోకుతూ, "పెద్ద చిక్కే తెచ్చిపెట్టారే...రెండు రామారాలు వున్నట్లుగా ఈ క్షణంవరకూ నాకు తెలియనే తెలియదు!" అన్నాడు.

"ఏం ఫరవాలేదు ... భయపడకండి...మీరు ఎవ్వరింటి కెళ్ళాలో చెప్పండి...నాకు రెండు ఊళ్ళలోనూ తెలియని మనిషి లేడు!" అన్నాడు—గర్వపడుతున్నట్లుగా మీసంమీద చేయి గూడా వేసుకున్నాడు..."నా లెక్క కరెక్టయితే మీరు...సరి సరి ముందు మీరు చెప్పండి!"

"నాకు మిత్రుడు సత్యం వున్నాడు ...చేస్తున్నది మాష్టారుగిరి!"

"అయితే చిన్న రామారమే!" అంటూ ఒక్క క్షణమాగి, "ఆయనకో చెల్లెలు రాధ అనే అమ్మాయి వున్నది... ఆ అమ్మాయిని చూడటానికే మీరు యిప్పుడు వచ్చింది!" అన్నాడు కళ్ళు చిలికించి రామ్మూర్తి మొఖంలోకి చూస్తూ.

తడబడ్డాడు రామ్మూర్తి. "అది ముఖ్యోద్దేశ్యం కాకపోయినా ... ఒక ఉద్దేశ్యమే!"

"నాకు తెలుసులేండి రామ్మూర్తి గారూ! మీరు అందుకే వెళ్ళుతున్నారు ...సత్యం స్టేషన్‌కి వస్తానన్నాడే ... ఎందుకు రాలేదు మరి!"

ఈ సారి గతుక్కుమనటం గూడా రామ్మూర్తి వంతే అయింది.

ఈ పెద్దమనిషికి తన పేరుగూడా తెలుసే!

"ఇంతకీ నేను చెప్పొచ్చేదేవిటంటే రామ్మూర్తిగారూ! రాధ అనబడే ఆ చక్కని చుక్కకు మీరు తగిన వరులు అనటంలో సందేహంలేదు...మీ రిద్దరూ చిలకా గోరింకల్లా వుంటారనేది నిస్సందేహం!" అన్నాడు చేతులూపుతూ.

నాకు ఆయన స్తోత్రం కాస్త వెగటే కలిగించింది. అంతకు మించి చికాకు గూడా వేసింది. కసురుకుందామంటే పెద్దమనిషాయె...అంతేగాకుండా ఆయనకు బాగా తెలిసినట్లే మాట్లాడేస్తున్నాడు గూడా...

"ఇంతకీ దారి చెప్పనేలేదు!"

"ఆయ్ గోపన్నా ... తలుపులన్నీ తాళాలు వేశావా?...నీ గోతాలూ, జంపకానాలు భోషాణం పెట్టి మీదకు జేరు

తున్నావా?...దీపం బుద్ధిలో కిరసనాయిలు వున్నదో లేదో చూచుకున్నావా? ...ఇక నన్ను వెళ్ళిరమ్మంటావా... పదండి రామ్మూర్తిగారూ...మాదీ ఆ రామారమే. సత్యంగారిల్లూ, మా యిల్లూ పక్కపక్కనే. కృష్ణః కృష్ణా... ఇవాల్టికి డ్యూటీ సవ్యంగా అయిపోయింది గదా? ఇక రేపొద్దటి వరకూ ఇటు పక్కకు ఒట్టి యింజన్‌కూడా రాదు. రైలు సంగతి తరువాత చూద్దాం?"

'చచ్చాం రా భగవంతుడా? ఇప్పుడు ఈయనగారు ఆ సత్యంగాడి దగ్గరకు జేరేటంతవరకూ వదలడన్నమాట ... ఖర్మ!' నెత్తినోరూ కొట్టుకున్నాడు లోలోనే రామ్మూర్తి.

"అప్పుడేమయిందంటే...!"

"ఎప్పుడూ?" నాలికజారి అన్నాడు రామ్మూర్తి.

"అదీ...నేను సర్వీసులో జేరినప్పుడు..."

రెండు మైళ్ళ నడకలో రామ్మూర్తిని పిచ్చెక్కించాడు ఆ పెద్దమనిషి.

చాలా రోజుల తరువాత చూసిన సత్యాన్ని ప్రేమగా కౌగలించుకున్నంత పని చేశాడు రామ్మూర్తి. "పండూ! నిన్ను చూసి ఎన్నాళ్ళయిందిరా వెధవాయ్!" అంటూ.

"ఇందాకటినుంచి నిన్ను ఎప్పుడు చూద్దామా అని కన్నార్పకుండా వాకిలి వంకే చూస్తూ కూర్చున్నాను. రారా? నాన్నా. స్టేషన్‌కే వద్దామనుకున్నాను గాని — నాన్న ఆరోగ్యం అంతగా బాగుండకపోవటంతో రాలేకపోయాను!" మ్లానవదనంతో అన్నాడు మూలగదిలో కదలకుండా పడివున్న తండ్రిని గుర్తుకు తెచ్చుకుంటూ.

"ఏమైంది నాన్నగారికి?'' ఆత్రంగా అడిగాడు రామ్మూర్తి.

"రెండు రోజులయింది. పెరాలిసిస్ స్ట్రోక్ వచ్చి!"

''అరె...చాలా యిబ్బందికరమైన జబ్బేనే అది. వయస్సెంత?"

అలా అడుగుతున్నప్పుడే ఓ యిరవై యేళ్ళ యువతి ఓ చిన్న గిన్నెతో నీళ్ళు తెచ్చి గడపమీద పెట్టింది.

ఆ అమ్మాయి రాధే అనిపించగా సావకాశంగా చూచాడు రామ్మూర్తి. స్టేషన్ మాష్టరు అన్నదాంట్లో అతిశయోక్తి ఏమీ లేదు—చక్కని చుక్కే!

"నా చెల్లెలు...రాధ!"

సాఫీగా నిల్చుంటూ, "నమస్కారమండీ!" అన్నది రాధ.

"నమస్కారం...నమస్కారం ." కాస్త తడబడుతూ అన్నాడు రామ్మూర్తి.

"లోపలికి పద!" సత్యం వెనక్కు తిరుగుతూ అన్నాడు.

రామ్మూర్తి చెప్పులు విడిచి, ప్యాంటు కొద్దిగా పైకి లాక్కొని, ఆ మెట్లమీదే కాళ్ళు కడుక్కున్నాడు. సత్యం తువ్వాలు అందించాడు.

"స్నానం చేసేయరాదూ!... భోజనంచేసి కూర్చుంటే ఎంత రాత్రయినా ఫరవాలేదు!"అంటూనే, "రాధా! నీళ్ళు తోడేసెయ్యమ్మ. స్నానం చేస్తాడు మూర్తి!" లోపలివైపుకు వంగి రాధతో చెప్పాడు.

"అలాగే. ముందు నాన్నగారిని చూద్దాం పద!"

"ఆ మూలగదిలో చీకట్లో పడుకొని వున్నారుగాని ... తరువాత చూద్దువుగానిలే. తొందరేంలేదు. నిన్ను గుర్తుపట్టరనే నమ్మకమేమీ లేదు!"

భోజనాలయ్యే టప్పటికి రాత్రి తొమ్మిది గంటలయింది. ఆ పైన బయటకు వచ్చేటప్పటికి బాదంచెట్టుక్రిందగా రెండు మంచాలు ... వాటిపైన తెల్లటి దుప్పట్లతో వాళ్ళని ఆహ్వానిస్తూ కనబడ్డాయి.

వాటిని చూస్తుంటే రామ్మూర్తికి నిద్ర ప్రేమగా పలకరించినమాటా వాస్తవమే. యిద్దరూ మంచాలమీద వాలారు.

రామ్మూర్తికి రాధ కళ్ళముందు కదులుతోంది. కొత్తమనిషి అని ఎలాంటి బిడియమూ లేకుండా తనముందు తిరుగుతున్న ఆ అమ్మాయిని చూస్తుంటే రామ్మూర్తికి ముచ్చటేసింది. పెద్ద పెద్ద కళ్ళు. కాస్త నలుపు అయితేనేం కళకళలాడుతోన్న మొఖం. ముక్కుకు మరీ అంత పెద్ద ముక్కుపుడక లేకుండా వుంటే ఇంకా బాగుంటుందేమో ననిపించింది.

తను 'ఇందుకు' వచ్చినట్లుగా ఆ అమ్మాయికి తెలియదేమోననే అనుమానమూ అతడికి కలుగకపోలేదు! అదే అడిగాడు సత్యాన్ని. "నే నెందుకు వచ్చానో రాధకు తెలియదా?" అంటూ.

"నేనే తెలియనీయలేదు!"

"ఏం?"

"ప్రత్యేకత ఏంలేదుగాని, రేపటి వరకూ తెలియనీయదలచుకోలేదు. అలా తెలిసిన మరుక్షణంలో సిగ్గు మొగ్గల్లో ముడుచుకుపోయి ఇక నీకు కనబడనే కనబడదు. ఒకళ్ళ నొకళ్ళు అర్థంచేసుకోవటానికి 'ఆ నిజం' ప్రతిబంధక మవుతోందనేనా భయం. శారదా అదేఅన్నది!

శారద సత్యం భార్య.

రామ్మూర్తి మాట్లాడలేదు. చాలా సేపటివరకూ రాధనే కళ్ళముందు తిప్పుకుంటూ మౌనంగా కూర్చున్నాడు.

''రేపుదయం చెబుతాను!"

"ఆల్ రైట్."

"ఇంతకీ నీకు రాధ ఎలావున్నదంటావ్?"

"రేపుదయంవరకూ టైం యిచ్చావు గదా. కానియ్!'' అన్నాడు నవ్వి.

రామ్మూర్తిని అర్థంచేసుకున్నవాడిలా నవ్వాడు సత్యం. రామ్మూర్తి మిత్రుడి నవ్వుతో శృతికలిపాడు — బాదంచెట్టు మీద గూళ్ళుకట్టుకున్న పిట్టలు ఆకులు గలగలలాడిస్తున్నట్లుగా కదిలినయి.

అలా నవ్వుల్ని మిత్రులిద్దరూ

నాలుగు దిక్కులా విరజిమ్ముతున్న సమయంలోనే స్టేషన్‌మాష్టర్‌గారుహడావుడిగా వాళ్ళ మధ్యకు వచ్చాడు.

"సత్యం! ఒక్కసారి రావోయ్. కాత్యాయిని పడిపోయింది!" వచ్చినంత తొందరగానే పరుగెడుతున్నట్లుగా వెళ్ళిపోయాడు ఆయన.

సత్యం మంచంమీదనుంచి ఒక్క దూకు దూకి ఆయన్ను అనుసరించాడు. ఏమైందోనన్న ఆదుర్దాలో రామ్మూర్తి లేచి అటువైపుకే నడిచాడు.

అప్పటికే ఆ యింటి హాల్లో ముగ్గురు నలుగురు ఆడవాళ్లు నేలమీద పడివున్న ఓ అమ్మాయిమీదకు వంగివున్నారు. ఆ అమ్మాయి గిలగిలా కొట్టుకుంటూ నోటివెంట నురుగులు కక్కుతోంది.

ఆ అమ్మాయి సన్నగా వున్నది. ఎర్రగావున్నది. అందంగా మెరిసిపోతున్నది.

ఎవ్వరో చేతిలో తాళంచేతుల గుత్తిని బిగుసుకుపోతున్న వేళ్ళను లాగి బలవంతంగా పెడుతున్నారు. నురుగులు గ్రక్కుతున్న నోట్లోకి స్టీలుస్పూను గుచ్చుతున్నారు. నాలిక కొరుక్కున్నట్లున్నది కొద్దిగా నెత్తురుగూడా వస్తోంది.

స్టేషన్ మాష్టారు ఏడుస్తున్నారు గూడా. "అమ్మా! కాత్యాయినీ నేను చూడలేనే తల్లీ నిన్ను!" అంటూ


పొడువైన నల్లటి జడ తలనుంచి బారెడుదూరం వరకూ పడి నాగులా ఆ అమ్మాయి అందాన్నే కాటేస్తున్నట్లుగా వున్నది.

ఆ అమ్మాయిది కొత్తగా చూచినవాళ్ళకు దిగ్భ్రమ కలిగించే అందం!

రామ్మూర్తి చిత్తరువులా నిలబడి వున్నాడు-అలాంటి అందగత్తెకా ఇలాంటి నిర్భాగ్యపు జబ్బు!

బాధగా హృదయం మెలికలు తిరిగిపోతుంది.

స్టేషన్‌మాష్టారు సత్యాన్నయితే




హడావుడిగా పిలిచాడుగాని అతడు మాత్రం ఏం చేయగలడు?... అందరితోపాటు చూస్తూ నిల్చోవటమే అతడు చేయగలిగిన పని!

—దూరాన ఎక్కడో నక్కలకూత ఉండి ఉండి భార్యలేని స్టేషన్‌మాష్టారి ఏడుపు.

కాస్త మనిషి కొట్టుకోవటం తగ్గిస తరువాత శారదే మరొకరి సహాయంతో లేవదీసి—పక్కనే దాద ఓ మంచం వాల్చి, దుప్పటివేయగా-పడుకోబెట్టింది. కాత్యాయిని ఒళ్ళంత చెమటలతో తడిసి ముద్దయింది.

"కాసిని వేడి వేడి కాఫీ ఇవ్వండి!" అన్నారు రామ్మూర్తి ముందుగా కోలుకొని శారదతో.

"అలాగే!"

విషాదం ఆ యింటిమీద మబ్బులా పారాడుతుంది. వీస్తున్న చల్లటిగాలి అక్కడి మనుష్యుల మనస్సుల మీద మంటల్ని రేపుతోంది.

సత్యం, రామ్మూర్తి, స్టేషన్ మాష్టరూ బయటకు వచ్చారు.

"ఇలా ఎప్పటి బట్టి వస్తున్నయి?" రామ్మూర్తే అడిగాడు.

"సంవత్సరం దాటింది!"

"డాక్టర్ ఏమంటాడు?"

"నరాల బలహీనత అంటాడు!"

"వివాహం అయిందా ఆ అమ్మాయికి!"

"కాలేదు......ఇంకెక్కడి పెళ్ళి," నిరాశతోనూ, నిస్పృహతోనూ నీరసించిపోయింది స్టేషన్ మాష్టారి కంఠం. "ఇలాంటి పరిస్థితులలో ఏం చెయ్యమంటారు...కనీసం వారాని కొకసారయినా వస్తుంది...వచ్చింతరువాత రెండు మూడు రోజులవరకూ నీరసం తగ్గదు."

"నామిత్రుడొకడు వున్నాడు ... హోమ్యోపతిదాగా ప్రాక్టీసుచేస్తున్నాడు. చాలాస్టడీ చేశాడు. అతడు ఇలాంటి రెండుమూడు కేసులు తగ్గించాడుకూడా!

రామ్మూర్తి స్టేషన్‌మాష్టారుని ఓరగా చూస్తున్నాడు.

వయస్సుమీరుతున్న ఆయనకుఎలాంటి మనస్తాపం?

"కాత్యాయనిని తీసుకురమ్మంటారా నన్ను!" అనిఅడిగాడు ఆశగా ఆయన.

"తప్పకుండా! వాడు చెప్పిందేనాకు...ఈలాంటి కేసులు...వివాహమయితే తగ్గటానికి ఆస్కారమున్నదని ..." అన్నాడు ఆయన్ను ఉత్సాహ పరుస్తూ.

"నేను అలాగే విన్నాను......కాని

దాన్ని ఏవరు చేసుకుంటారు చెప్పండి... అంతేగాదు జబ్బుదాచి వివాహం చేయటంకూడా నా కిష్టంలేదు...అది తగ్గకపోతే ఆ సంసారం నిలిచిందాకా నమ్మకమేమిటి?...తాకపోంగా ఆదో దిగులు... దాన్తో అది మరింతఎక్కువయినాఎక్కువవ్వవచ్చు!"

రామ్మూర్తి సాలోచగా ఆగిపోయాడు "నిజమే...నేనూ కాదనలేను!"

అలా మాట్లాడుకుంటూ మబ్బులు పట్టిన ఆకాశం క్రింద కూర్చున్న వాళ్ళ దగ్గరకు ముందు శారద వచ్చింది. ఆ పైన రాధ.

సత్యం, రామ్మూర్తి లేచినిలబడ్డారు.

"వస్తాం...మరి! ఇక ఏమీ హడావుడి చేయకపోవచ్చు... మరీ అవసరమనుకుంటే లేపండి...ఫరవాలేదు!"

"థాంక్యూ!"

గడపదాటి బయటకు వచ్చారు తమ యింటి మెట్లెక్కుతుండగా "కాత్యాయనిది తల్లి పోలిక అనుకుంటాను!" అన్నాడు రామ్మూర్తి చిన్నగా.

"అవును...ఆమె ఫోటో చూశావా?"

"ఊఁహూఁ... తండ్రి పోలిక గాదు కనుక తల్లిపోలికే అయివుంటుందని నా ఊహ!" నవ్వాడు రామ్మూర్తి. "అంత అందమూ ఆ జబ్బుకు లోకువే అయిపోయిందనిపిస్తోంది!" జాలిగాఅన్నాడు.

మరు రెండడుగులు వేసింతరువాత అనుమానంవచ్చి మెడ తిప్పి పక్కకు చూస్తే తనవైపే చూస్తున్న రాధ కనబడింది. రాధముందు కాత్యాయిని అందాన్ని ప్రశంసించినందుకు కాస్త తడబడ్డాడు...తొందర పడ్డానా అనిపించగా కించత్ బాధకూడా కలిగింది మనస్సుకు.

ఆ తరువాత ఇంకో మాటఅతడినోటి వెంట అతడు నిద్రపోయేటంతవరకూ వెలువడలేదు. ఎందుకలా అన్నానా అని మంచంమీద పడుకొని నిద్రపట్టేంతవరకూ ఆలోచిస్తూనే వున్నాడు ... పాశ్చాత్తాప పడుతూనే వున్నాడు...

'ఏమైనా కానీ... ఆమె అందం మరొకరికి రాదు!"

* * *

మరునాడు ఉదయం రామ్మూర్తి వరండాలోకూర్చొని పేపరుచూస్తుండగా లోపలినుండి రాధ మాటలు చిన్నగా వినబడ్డాయి. పేపరు చదువుతూనే మధ్యలో ఒకటి రెండుసార్లు తనపేరు వినబడతంతో ఆసక్తిగా చెవులు రిక్కించాడు రామ్మూర్తి.

ఆమె తన అన్నయ్యతో మాట్లాడుతుంది. "నీ యిష్టం అన్నయ్యా!... నా మనస్సులోని మాట చెప్పాను . . . నాకు గోపాలం బావను వివాహం చేసుకోవాలని వున్నది.. కాదూ రామ్మూర్తి గారినే చేసుకోవాలీ అంటావా... అన్నయ్య మాటగా నీ మాటలకు విలువ యివ్వకతప్పదు. అలాగేచేసుకుంటాను!"

"ఇప్పుడు వాడికి ఈ సంగతి చెప్పటం నాకు చాలా బాధ కలిగిస్తోందమ్మా. నీవు ముందుగా నాకు చెప్పివుండవలసింది!"

"నీవు నాకా అవకాశాన్ని ఎప్పుడైనా ఇచ్చావార అన్నయ్యా! . అసలు మీ మిత్రుల్ని ఇందుకోసంగా నువు రమ్మన్నట్లుగా నాతోటి మాటమాత్రంగానైనా అన్నావా?" కాస్తనిష్ఠూరంగా అన్నది.

"నన్ను చాలా ఇరకాటంలో పెట్టేస్తున్నావే చెల్లాయ్!"

రామ్మూర్తి ఇబ్బందిగా ఆకుర్చీలోనే ఎవరో తనని దొంగతనంగా చూస్తున్నట్లుగా కదిలాడు.

రాధ నవ్వింది. "పోనీయ్ ఒక పని చేద్దాం అన్నయ్యా. కాత్యాయిన్ని చేసుకోమని మీ మిత్రుణ్ణి అడిగితే!"

"కాత్యాయినినా?" ఆశ్చర్యంగా చెల్లెలి మొహంలోకి చూచాడు సత్యం, "ఫిట్స్ వచ్చే కాత్యాయినినా?"

రామ్మూర్తికి ఒక్కసారి గుండె ఆగి మళ్ళీ కొట్టుకోవడం మొదలుపెట్టింది.

"అవును అన్నయ్యా! రాత్రి తెల్లవార్లూ నిద్రలేకుండా ఆలోచించాను... అలా అయితే చాలా బాగుంటుం దనిపించింది. పెండ్లయితే తగ్గవచ్చనీ, ఆయనకు తెలిసిన మంచి డాక్టరున్నారనీ ఆయనే చెప్పారు గదా! మిత్రుడి భార్యాగా ఆయన మరింత శ్రద్ధతో ట్రీట్ చేయ్యవచ్చు!"

రామ్మూర్తి రాధ మాటలకు అయోమయంగా తెరిచివున్న పేపర్లోకి చూస్తున్నట్లుగా గుడ్లప్పగించి కూర్చున్నాడు. అందులోని అక్షరాలు గజిబిజిగా మెలికలు మెలికలుగా— దారి తప్పి అర్థరహితంగా పయనిస్తున్న చిన్న చిన్న పురుగుల్లా కనబడుతున్నాయి.

"తగ్గకపోతేనో?" నీరసంగా అడిగాడు చెల్లెల్ని సత్యం.

"ఏదైనా మంచి జరగాలనే చేస్తాం. అలా కోరుకుంటాం గూడా. అలా కాదూ అనుకుంటే జీవితమేలేదు. నన్ను వివాహంచేసుకొని మల్లెపువ్వుల పల్లకీలో తిరగాలనే అనుకున్నాడనుకో — చేసుకున్నమరునాడేనేను గుటుక్కుమంటే!"

"ఛ! ఏం మాటలే అవి!"

"అదే నేననేది మనంచెడు ఎందుకు ఆలోచించాలి. అంతా మంచి జరుగుతుందనే అనుకుందాం!"

"కానీ తెలిసి కష్టాల్ని కొనితెచ్చుకోవటం నాకిష్టంలేదే రాధా! జీవితాల ప్రయోగమేమిటి? సత్యం బయటకు వస్తున్నట్లు సవ్వడి అవగా-రామ్మూర్తి లేచి వరండా చివరకు వచ్చి ఆకాశంలో ఎగురుతున్న నల్లటి కాకులగుంపువైపు చూస్తూ నిల్చున్నాడు.

రాధకు తనమీద కంటే గోపాలం బావమీద ఇష్టం ఎక్కువగా వున్నదన్న మాట.

ఆల్‌రైట్. రాధను గురించి ఇక తను ఆలోచించటం అనవసరం.

సత్యం భుజంమీద చేయివేస్తే రామ్మూర్తి ఉలిక్కిపడ్డాడు.

"అలా పొలందాకా వెళ్దాంపద."

పద! బహుశః ఊరిబయటకు తీసుకువెళ్ళి పచ్చని పైరుల నడుమ తిప్పుతూ, తన మనస్సుకు ఎక్కడకష్టం కలుగుతుందో అన్నంత సున్నితంగా అసలు విషయం చెప్పటానికి ప్రయత్నించవచ్చు.

ఎంత మర్చిపోదామనుకున్నా రాధను గానీ, రాధ మాటల్నిగాని మర్చిపోలేక పోతున్నాడు. అడుగులు తడిగట్లమీద యాంత్రికంగా పడుతున్నాయి. చిత్రకారుడి రంగుకలుపుకున్న గిన్నె ఒరిగి పోయినట్లుగా ఎక్కడ చూచినా పచ్చని పైరు ముద్దలు ముద్దలుగా కనబడుతోంది. అక్కడక్కడా రంగురంగుల పేరు తెలియని పిట్టలు కాళ్ళకు పచ్చరంగు పులుముకుందామాఅన్నంత ఉత్సాహంగా ఆగుతూ ఎగురుతున్నాయి. కృష్ణపాయమీదగా కట్టిన చిన్న వంతెవ దాటారు మిత్రులిద్దరూ.

"నన్ను ఒకందుకు మన్నించాలిరా మూర్తీః"

"ఎందుకైందిః" అన్నాడు — తనకు అంతా తెలుసు అనే నిజాన్ని తెచ్చి పెట్టుకున్న ఆశ్చర్యంతో కప్పివేస్తూ.

"నేను కాదూ గూడదూ అంటే జరుగుతుందిగానీ. అలా అడగటం ఎంత వరకుసమంజసం అనిఆలోచిస్తున్నానుః"

"ఏ విషయంలోః"

ఎక్కువసేపు అతడికి అందకుండా తిరగటం అనవసరం అనిపించింది. రామ్మూర్తికి.

"మా మేనత్తకో కొడుకువున్నాడు. పేరు గోపాలం. బి. ఎస్. సి. ఎగ్రికల్చర్. శుభ్రంగా స్వంతపొలాలు చూసుకుంటున్నాడు. అతడికి రాధంటే యిష్టమున్నదో లేదో నాకయితే తెలియదుగాని, రాధకి మాత్రం అతడంటే



యిష్టమని నాకు కొద్ది నిముషాలక్రితమే తెలిసిందిః" చాలా బాధగా అన్నాడు— ఆ బాధ అనేది రాధ గోపాలమంటే యిష్టపడుతున్నందుకుగాదు. మిత్రుణ్ణి ఆ విషయంలో ఇంతదూరం ఆహ్వానించి నిరాశపరుస్తున్నాననేః

"ఆ అదృష్టవంతుడికీ— మీచెల్లెలికీ గూడా నా అభినందనలు చెప్పుః" మాటలు తూచితూచి అన్నాడు.

"కోపం వచ్చింది గదూః" సత్యం వెనక్కు తిరిగాడు.

రామ్మూర్తి బరువుగా నవ్వాడు. "లేదు. ఉహూ. చాలా ఆనందంగా వున్నదిరా. మనస్సు విప్పి మాట్లాడే వాళ్ళంటే — ఎవరైనా సరే నాకు యిష్టమేః"

నిజమేమరిః ఏదో అన్నయ్యచెప్పాడు గదా అని తనని చేసుకొని జీవితాంతం గోపాలంబావను చేసుకోలేదనే మనస్తాపంతో — తనలో లేని వేదినో ఆ గోపాలంలో చూసుకుంటూ నిరాశ నిస్పృహలతో బ్రతికేదాని కంటే — ఆ కోరుకున్న వాడినే చేసుకోవటం అన్ని విధాల ఉత్తమం.

వాళ్ళిద్దరి నడుమా ఇక మాటలే కరువయినయి అన్నట్లుగా ఆ గట్లేపట్టుకొని తలలు వంచుకు నడుస్తున్నారు.

వాళ్ళనీడలను కుదించుతూ సూర్యుడు పైకిపైకి పోతున్నాడు.

"నన్ను మన్నిస్తావుగదూః"

"ఛస్ః నోర్ముయిరా. బంధువుల కంటే స్నేహితులలో ఆత్మాయిత ఎక్కువగా వుంటుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ః" హాయిగా నవ్వాడు. రామ్మూర్తి మిత్రుడి భుజాలు పట్టుకొని "జరిగిదంతామర్చిపో. లగ్నాలు పెట్టిస్తే రాధపెళ్ళి నా చేతులమీదగా జరిపిస్తాను సరాః"

సత్యం కళ్ళు మిత్రుడి మనస్సుకు సిగ్గుతో తడిసినయి. ఆనందంతో రెప రెపలాడినాయిః

వెనక్కు తిరిగారూ యిద్దరూ-

"ఇవాళనేనువెళ్ళిపోతానుః" అన్నాడు "రామ్మూర్తి —తిరిగి స్టేషన్ మాష్టారు

కూతురి ప్రసక్తి రాకముందే అక్కడ నుంచి వెళ్ళిపోతే ఎంతో బాగుంటుం దనిపించింది.

తను వాళ్ళకు ఆ వ్యాధిని గురించి చెప్పిన విషయాలు నిజమే. కాని—తన కున్న ఆర్థికపరిస్థితులలో తానెంతవరకు ఆ బరువును మోయగలడు?

ఇప్పటికీ తల్లికి ఇక నయంచేయలేని గుడ్డితనం, భర్తపోయిన చెల్లెలి పోషణ-దాని రెండేళ్ళ కొడుకు ఎప్పటికి ఎద్ద వాడయ్యేను —ఎప్పుడు దానిని ఉద్ధ రించేను — వీటన్నిటికితోడు ఫిట్స్ భార్యను కొనితెచ్చుకోవటమా?

ఎం వో? !

తగ్గవచ్చు-తగ్గుతుందిగూడా - కానీ ఒకవేళ తగ్గకపోతే ?

— ఇక తన జీవితానికి సుఖ మెక్కడిది ? ఆనంద మెక్కడిది?

తను అదృష్టవంతుడే అయితే యాభైళ్ళకే తల్లిఎందు కలాఅవుతుంది? పాతికేళ్ళకే చెల్లెలు పుట్టింటినే శాశ్వత నివాసంగా ఎందుకు చేసుకుంటుంది?

కాత్యాయిని కళ్ళముందు మెదిలింది. ఆ అపూర్వ సౌందర్యరాశి నురుగులు కక్కుతూ తన గుండెల్ని మెలేస్తుంది ?

ఆ అమ్మాయిమీద జాలితో తన ఆనందాన్ని పణంగా పెట్టగలడా? తన భవిష్యత్తు నంతా దీపంలా వెలిగించి గాలిలో వుంచగలడా?

ఉహుం.

మళ్ళీ ఆ కాలువమీద వంతెన దాటారు. ఊరి బయట పూరిళ్లుదాటారు. ఊరికి కాపలకాస్తున్నట్లున్న మర్రిచెట్టు దాటారు. శివాలయం దాటారు. శివాల యంకు వెనుకగా వున్న రామాలయం దాటారు.

ఇంకో నాలుగడుల్లో తమ యిల్లు వస్తుందనగా రామ్మూర్తే తన ప్రయాణం గురించి హెచ్చరించాడు. "ఏమంటావ్ నా సంగతి?"

"ఉందామనుకున్న అన్ని రోజులూ నిన్ను వుండమని అనలేను. ఈ రోజు మాత్రం వుండివెళ్ళు-మళ్ళీ ఎన్నాళ్ళకు వస్తావో !"

"సరే!" అన్నాడు రామ్మూర్తి— కాదంటే సత్యం ఎక్కడ బాధ పడ తాడో అన్నట్లుగా.

* * *

భోజనం చేసి హాల్లోకి వచ్చేటప్పటికి స్టేషన్ మాష్టారు కుర్చీలో కూర్చొని రామ్మూర్తికి గతుక్కుమనేలా కనబడ్డాడు.

మనిషిని భయం కనబడని నీడలా వెన్నాడుతుంది.

"రాత్రికి మీరు మా యింటికి భోజ నానికి రావాలి అది చెబుదామనే వచ్చాను. మళ్ళీ స్టేషన్‌కి వెళ్ళాలి!"

"థాంక్సండీ! కాని నన్ను మన్నిం చాలి. నేను రేపుదయాన్నే వెళ్ళిపోతు న్నాను. ఈ రాత్రికి సత్యంతోభోజనం చేయక తప్పదు. మరోసారి వచ్చి నప్పుడు తప్పకుండా మీ యింట్లో వుంటాను."

ఆయన నవ్వుతో లేచాడు. సత్యంతో కలిసి భోంచేయవద్దనటంలేదే. అతడు వస్తాడు. రాధ వస్తుంది. శారద వస్తుంది. మీకు సత్యం ఎంతగా కావల్సిన వాడో నాకూ అంతే. నామాట కాదనకబోకండి నన్ను నిరాశ బుచ్చకండి. అంతేగాదు మీతో మరికొన్ని ముఖ్య విషయాలు గూడా మాట్లాడాలి !"

ఆయన వెళ్ళిపోయాడు నోరు తెరు చుకునిల్చున్న రామ్మూర్తిని అతడి ఆలో చనలకి, అనుమానాలకీ, భయాలకీ— వాటి తాకిడికీ నీడలకూ అతనిని వదిలి వేసి.

సత్యం వచ్చాడు వక్కపలుకుల సాను తీసుకొని. "ఆయనకు అటూ యిటూ ఎవ్వరూలేరు. నా మిత్రులే ఆయన మిత్రులు. నా బంధువులే ఆయన బంధువులు!" తేలిగ్గా నవ్వాడు. "ఏం ఫరవాలేదు వెళ్దాం. ఆయన మనస్సును కష్టపెట్టబోకు!

రామ్మూర్తి ఒక్కసారి మూలిగి గూడ లేగరేశాడు.

"సరే!"

"కాత్యాయిని వంట ఎంత చక్కగా చేస్తుందో తెలుసా? దాని రుచి ముందు ఆమె అందం దిగదుడుపే !"

రామ్మూర్తి భయంగా తలెత్తాడు— ఆ మాట తనమీద అతడు విసిరివేసిన వలలా వున్నది.

—సత్యమూ అదే ఉద్దేశ్యంలోవున్నా డేమో. తను వాడికెంతో ఆయనకుతనంతే అంటున్నాడు. అటువంటి ఆయన కూతురిని ఒడ్డుకు జేర్చటంలో తన సహాయం కోరగూడదనేమున్నది?

ఈ అల్లుకుపోతున్న సాలెగూడులో నుంచి మధ్యాహ్నమే పారిపోయివున్నట్ల యితే ఎంత హాయిగా వుండేది?

కాని ఎలా? సత్యం అంతగా వద్దంటే మొండికెత్తి ఎలా వెళ్ళగలుగుతాడు? అసలువాడు తనని ఈ రాత్రికి వుండ మనటానికి కారణం ఇదేనా?

ఆలోచనల సుడుల్లో గిలగిల లాడ సాగాడు.

—అయినాతనెందుకు భయపడాలి? తనుఏంచూసి భయపడాలి? ఈమాత్రపు చిన్న పరీక్షను ఎదుర్కొలేనివాడుఎంతో భవిష్యత్తువున్న తను ఎలా నెగ్గుకు రాగలుగుతాడు? ఉహుం. తనుధైర్యంగా ఉండాలి. ధైర్యంగా ఎదుర్కోవాలి. తనకు యిష్టంలేకుండా ఎవరైనా ఏమైనా చేస్తారా? చేయగలుగుతారా?

అవసరమొస్తే అబద్ధాలు చెబుతాడు. ఓ ఆడకూతురు రాధే తన మనస్సులోని మాటను అంత ధైర్యంగా చెప్పినప్పుడు తను ఆ మాత్రం చేప్పలేడా? తనకా మాత్రం ధైర్యం లేదా? తనకు మనస్సు లేదా? తనకు వ్యక్తిత్వం లేదా?

స్టేషన్‌మాష్టారు దగ్గర తనకు మొఖ

మాటమేమిటి? నిన్నటి వరకూ ఎవరో తెలియని ఆయన్ను గురించి తానెందుకు అసలు ఇంతగా ఆలోచించాలి!

కాత్యాయినిని వీళ్ళంతా కలసి తనకు అంటగడితే తను చేతులు ముడుచుకు కూర్చొని మెళ్ళో తాళికట్టేసి జీవితాంతం ఆమె ఫిట్స్‌తో తను కుస్తీపడుతూ కూర్చోవటమేనా తన ధ్యేయం ఇక!

ఎందో మళ్ళీ భయం.

సత్యం ప్రతిమిలాడితే. స్టేషన్ మాష్టారు కన్నీరు కారిస్తే కాత్యాయినే కాళ్ళమీదపడి తనమీద జాలితలచమంటే ఇంత ధైర్యం చెప్పిన మీరె ఇంతగా దిగజారిపోతారా అని రాధ ఎగతాళి చేస్తే.

తను నీరసపడిపోయి ఓడిపోతాడా? నిర్దాక్షిణ్యంగా కాదనగలిగే ధైర్యం తన కుంటుందా?

తల విదిలించాడు, బరువును మోయ లేనట్లుగా రామ్మూర్తి.

"ఒక్కసారి స్కూలుకువెళ్ళి వస్తాను" అంటూ సత్యం బయటకు వెళ్ళాడు.


రామ్మూర్తికి ముందు సత్యంమీద, ఆపైన రాధమీద గొంతువరకూ కోప మొచ్చింది. ఆవిడగారు మాత్రం గోపాలాన్ని ప్రేమిస్తున్నానంటూ ఆ తీసే దీర్ఘాలేవో ముందుగానేతీస్తే సరిపోయేది!

"ఆ గదిలో మంచం వేశాను!" శారద తలుపవతలి నుండి చెప్పిపోయింది.

ఉన్నట్లుండి రామ్మూర్తికి మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. మొఖమంతా ఆనందంతో విప్పారింది. ఉత్సాహం వచ్చింది. కూరుకుపోతున్న ఊబిలోనుంచి చటుక్కున బయటపడ్డట్టుగా హుషారుగా లోపలికి నడిచాడు.

తనూ రాధ నడిచిన బాటనే నడిస్తే సరి. రాధమ్మ తల్లీ! థాంక్యూ వేరీమచ్

'—నాకూ ఒకమేనత్త కూతురు సీత వున్నది. ఆ అమ్మాయి నేనంటే పడిచస్తున్నది. ఆరేయ్ మిత్రమా! సత్యం.



నేను రానంటే నీవెక్కడ బాధపడతావని ఇంతదూరం పడివచ్చాను. నీవు కాదూ గూడదూ అంటే నా సీతను త్యాగంచేసి రాధ మెళ్ళో తాళిగడతాను. చెప్పు. నీ మాటే నామాట!"

రాధ ఎలాగూ లేదన్నది. ఇక తాను సీతను వదులుకునే ప్రసక్తిరాదు. కనుక కాత్యాయిని ప్రశ్నే లేదు.

కళ్ళుతెరుచుకొని ఆలోచనల ఆవిర్లలో పైకి క్రిందకు తిరుగుతుండగా తలుపు దగ్గర చిన్నగా దగ్గిన శబ్దమయింది.

ఉలిక్కిపడి తల తిప్పాడు.

అక్కడ కాత్యాయిని నిల్చున్నది.

ఇంద్రధనస్సులా వున్న ఆ అమ్మాయిని చూస్తూనే — రాబోతున్న ఉరుములూ మెరుపులను తప్పుకోవటానికి అన్నట్లుగా తడబడుతూ లేచి కూర్చున్నాడు.

పడగవిప్పి నృత్యం చేస్తున్నట్లుగా నిల్చున్న కాత్యాయినిని చూస్తుంటే ఈ అమ్మాయేనా నిన్నటి రాత్రి నురుగులు క్రక్కుతూ నేలనపడివున్నది — అనిపించింది.

"నన్ను మన్నించాలి. ఒక్క మాట చెప్పివెళ్దామని వచ్చాను. మీరేదో మా నాన్నగారిలో నామీద లేనిపోని ఆశలు కల్పించారట. అవి నిజమవుతయో, అబద్ధమవుతయ్యో ఆ భగవంతుడికే తెలియాలి. కాని ఆ ఆశల్నే గుండెల నిండా నింపుకొని, కోరికలు పెంచుకొని మనిషి పెరిగిపోయి, ఆ ఆశలు రేకెత్తించిన మిమ్మల్నే ఎరగాచేసి అగ్నిలో కుతకుతలాడిపోతున్న నా జీవితాన్ని బయటకు లాగాలనుకున్నాడు మా నాన్న. నా లాంటి కూతురున్న ఆయనకు అలాంటి కోరిక లుండటం అసహజం అని నేను అనలేనుకాని, నా ఆనందంకోసరం, నా భవిష్యత్తుకోసరం-మరొకరి ఆనందాన్నీ వారి జీవితాన్ని లాటరీ పెట్టటం నేను సహించలేను. నేను అంగీకరించలేను. నేను చూస్తూ ఊరుకోలేను. వివాహం అయింతరువాత ఈ రోగం తగ్గుతుందా లేదా అనేది నేను ఆలోచించను. ఈ క్షణాన ఆలోచించలేను. అందుకే నన్ను శనిలా ఆవరించిన ఈ రోగం నన్నువదిలితేనే నా వివాహప్రసక్తి. నాభవిష్యత్తుని గురించిన ఆలోచన....లేదా! లేదు. అందుకే నే చెప్పేది- నా అందంచూసి ఆశపడో. నా జబ్బుచూసి జాలిపడో ఈ విషవలయంలో ఇరుక్కొనిగిలగిలాకొట్టుకొని మాడిపోకండి. మన్నించి నన్ను మర్చిపోండి.

విద్యుల్లతలా తటుక్కున మెరిసి క్షణంలో మాయమయిన ఆ బంగారు తీగెనే మర్చిపోలేనట్టుగా విప్పారిన నేత్రాలతో విస్మయంగా ఆ అమ్మాయి వెళ్ళిన వైపే చూస్తూకూర్చుండిపోయాడు రామ్మూర్తి!